క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై విచారణ



ములపర్రులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెనుగొండ: ములపర్రు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులను సర్పంచ్ భర్త దుర్వినియోగం చేశారంటూ ఇటీవల భీమవరంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు స్థానికులు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల ఈఓపీఆర్డీ వై.కిషోర్ బాబు విచారణ నిర్వహించారు. సిబ్బంది లేకపోయినా జీత భత్యాలు, ఇతర కార్యకలాపాలకు రూ.7,75,844 నిధులు డ్రా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఈఓపీఆర్డీ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతల సహకారం ఎంతగానో దోహదపడుతుందని అంబేద్కర్ సేవా సమితి సెక్రటరీ నేతల రాఘవరావు అన్నారు. సోమవారం పోడూరు మండలంలోని గుమ్ములూరు మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాలలో 26 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాకా కుమార్‌రాజు, సేవా సమితి సభ్యులు పిల్లి ఫ్రెడ్రిక్‌రాజు, ఎంపి రావు, ఎస్ఎంసి చైర్మన్ రావి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

నేడు నరసాపురంలో మెగా రక్తదాన శిబిరం

భీమవరం: దివంతగ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నరసాపురంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజవిభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నరసాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రక్తదానశిబిరాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణ కల సాకారం అయ్యిందంటే అది ఎమ్మార్పీఎస్ వల్లేనని ఎమ్మార్పీఎస్ నాయకుడు దిగుమర్తి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పెనుగొండ, ఆచంట మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, తానేటి సత్యానందం, ఆకుమర్తి ఆనందరావు, తానేటి లాజర్ పాల్గొన్నారు.

కాళ్లకూరు సొసైటీలో నూరు శాతం రుణ రికవరీ

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు సహకార సంఘం పరిధిలో 2024–25 సంవత్సరానికి రైతుల నుంచి రుణ బకాయిలను నూరు శాతం వసూలు చేసినట్లు సొసైటీ సీఈఓ ఐ.శ్రీనివాస్, అఫీషియల్‌పర్సన్ ఇన్‌చార్జి కె.వర్థిని తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సంఘ సభ్యుల నుంచి రావాల్సిన వివిధ రకాల రుణాలు మొత్తం సుమారు రూ.19.48 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు.

నరసాపురం మున్సిపాలిటీకి పన్ను పోటు

- వసూళ్లలో కొనసాగుతున్న కుమ్మక్కు రాజకీయాలు
- అనధికారికంగా పన్నులను వసూలు చేస్తున్న కాంట్రాక్టర్
- ఆర్డీఓకు మున్సిపల్ వీసీ, మరో కౌన్సిలర్ ఫిర్యాదు



అనధికార వసూళ్లు ఆపాలంటూ ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ వీసీ నాగిని, కౌన్సిలర్ రామసీత

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో రోజువారీ మార్కెట్ పన్నుల వసూళ్ల అంశంలో జరిగిన బహిరంగ వేలంలో కుమ్మక్కు రాజకీయాలు చేయడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి కొట్టిన వ్యవహారంలో హైడ్రామా కొనసాగుతూనే ఉంది. సదరు గుత్తేదారుకు పన్ను వసూళ్ల హక్కులు కల్పించవద్దంటూ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, 28వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కావలి రామసీత డీసెంట్ ఇచ్చినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా గుత్తేదారు ద్వారా పట్టణంలో అనధికారంగా పన్నులు వసూళ్ల ప్రారంభం కావడం విషేషం. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా జనసేన నేతగా ఉన్న కాంట్రాక్టర్‌కు సహకరించడం, మున్సిపల్ చట్టంలోని నిబంధనలను తుంగలోకి తొక్కి వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నారు.

డీసెంట్‌ను పట్టించుకోని వైనం

గతేడాది రూ.73 లక్షలలకు వెళ్లిన పన్నుపాట, ఈ సారి కేవలం రూ.38.16 లక్షలకు జనసేన నేత ఒకరు దక్కించుకున్నారు. అధికారులు, కొందరు కౌన్సిలర్లు, గుత్తేదారు కుమ్మక్కు వ్యవహారంతో కౌన్సిల్‌లో పాట ఆమోదం జరిగిపోయింది. అయితే దీనిని తప్పుబడుతూ వీసీ కామన నాగిని, కౌన్సిలర్ రామసీత డీసెంట్ ఇచ్చారు. డీసెంట్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చేవరకూ పన్ను వేలం అంశాన్ని పక్కన పెట్టాలి. అయితే జిల్లా కలెక్టర్ నుంచి ఎలాంటి నిర్ణయం రాకుండానే సదరు గుత్తేదారు ద్వారా అనధికారంగా పన్నుల వసూళ్లు చేయిస్తూ మున్సిపల్ అధికారులు అధికార పార్టీ నేతల విషయంలో తమ స్వామి భక్తిని చాటుకోవడం, ఇందుకోసం లక్షలాది రూపాయిల మున్సిపాలిటీ ఆదాయాన్ని పణంగా పెట్టడం ప్రజల్లో చర్చనీయాంశమైంది. పన్నుపాట కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించినా అతని వద్ద నుంచి అడ్వాన్స్ కట్టించుకోవాలి. అసలు ముందు డీసెంట్ విషయంలో అడ్డంకులు క్లియర్ అవ్వాలి. కానీ మున్సిపల్ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా ముందుకు వెళుతున్నారు.

అనధికార పన్నుల వసూళ్లు ఆపాలి

అనధికార పన్నుల వసూళ్లు ఆపాలని సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్ కావలి రామసీత కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కౌన్సిల్‌లో తాము డీసెంట్ ఇచ్చినా, మున్సిపల్ చట్టాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారించి చర్యలు చేపడతామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. మొత్తానికి పన్నుపాట వ్యవహారం మరెన్ని మార్పులు తిరుగుతుందో వేసి చూడాలి.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు



ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజుకు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారం విషయంలో చురుగ్గా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో మహానేతకు నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు మంగళవారం పాలకొల్లు నియోజకవర్గంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పార్టీ నాయకులు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి తదుపరి పార్టీ నాయకులతో కలిసి స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకుని అక్కడ ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అక్కడ నుండి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోగులకు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆచంటలో

పెనుగొండ: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం ఆచంటలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామని పార్టీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాయకులంతా వారి వారి గ్రామాలలో ఉదయమే జయంతి వేడుకలు నిర్వహించి మండల పరిషత్ కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యక్రమం ముగిసిన తరువాత మేడపాడు, అడవిపాలెం గ్రామాలలో కూడా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం పాలకొల్లు పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడ వేడుకల్లో పాల్గొంటామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక



వైఎస్సార్ సీపీ పెదమామిడిపల్లి గ్రామ కమిటీ



వైఎస్సార్‌సీపీ కొత్తపేట గ్రామ కమిటీ

పాలకొల్లు సెంట్రల్: మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులందరూ వచ్చే ఎన్నికల్లో జగనన్న విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఏసురాజు అన్నారు. సోమవారం మండలంలోని పెదమామిడిపల్లి, కొత్తపేట గ్రామాల్లో కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో ఒరిగిందేమి లేదన్నారు. రాబోయే రోజులు వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం నేటి నుంచే ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా పెదమామిడిపల్లి సర్పంచ్ వేండ్ర గోపి నివాసంలో జరిగిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బండి నెహ్రూ, సెక్రటరీ వేండ్ర కృష్ణ మరో 30 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించామన్నారు. అలాగే కొత్తపేట గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దాసరి లాజర్, సెక్రటరీ అప్పారి పార్థసారధిలతో పాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మైకేల్ రాజు, కోలాటి నవీన్, రెడ్డి మోసు నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు పెదపాటి వెంకటరత్నం, మన్నె వెంకట్రావు, కవురు గాంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని ధర్నా



పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న కాలనీల వాసులు

పెనుగొండ: కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం కాలనీ వాసులు ఎదురు చూపులు చూస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. సోమవారం పెనుగొండలో కాలనీల్లోని కాలనీ వాసులతో కలిసి పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో ధర్నా నిర్వహించి పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు జి.అనితకుమారికి వినతి పత్రం సమర్పించారు. మౌలిక సదుపాయాల కోసం కోరుతుంటే స్థానిక ఎమ్మెల్యే వచ్చి పరిశీలిస్తారని, అనంతరం సదుపాయాలు కల్పిస్తామని అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, చిట్టూరి శ్రీనివాస్, నార్ల పుష్ప వెంకటలక్ష్మీ, యండమూరి సత్యవతి, దొండా వెంకటరత్నం పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ తరగతులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ కంప్యూటర్స్‌లో 55 శాతం మార్కులు వచ్చి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10న ఉదయం పది గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుకు

యలమంచిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్ (కాంట్రాక్టు పద్ధతిన) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం కళాశాల పిన్సిపల్ టి.కనకదుర్గ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 11వ తేదీలోపు (శుక్రవారం) దరఖాస్తులను కళాశాల పని వేళలో కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

సంక్షోభంలో గీత కార్మికులు

ఆకివీడు: కల్లు గీత కార్మికులు రాష్ట్రంలో సంక్షోభంలో పడ్డారని గీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్కా చంటి ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆకివీడు సర్కిల్‌లోని గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలుజేసే విధంగా ఈ నెల 14న గీత కార్మికులు మోకులు ధరించి రావాలని పిలుపునిచ్చారు. మద్యం ఆదాయం కావాలా? ప్రజల ఆరోగ్యం కావాలా? అనేది ప్రభుత్వం తేల్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: గోదావరికి వరద ఉధృతి పెరగనుండడంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు, అధికారులూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట మండల తహసీల్దారు జి.కనకరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో 9 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తుందని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం

- మేడపాడులో మధ్యలోనే ఆగిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



అసంపూర్తిగా ఉన్న మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



లంకలకోడేరులో పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

యలమంచిలి: గ్రామీణ పేద ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేడపాడు, లంకలకోడేరు గ్రామాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలను మంజూరు చేశారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. అందులో లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తయి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తుండగా, మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రజలంతా ఈ భవనం కూడా పూర్తి చేయాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయ్యినప్పటికీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన మేడపాడు ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో నిరుపయోగంగా తయారైంది. పేద ప్రజలకు ఉపయోగపడే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేస్తే పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తి చేయకపోతే భవనం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదముంది. ఇప్పటికే భవనం చుట్టూనే కాకుండా భవనం అరుగులు మీద కూడా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇలానే వదిలేస్తే ఇంత వరకు ఖర్చు పెట్టినదంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

మదర్ పీహెచ్‌సీకి ఇబ్బందులే

యలమంచిలి మండలంలో మేడపాడు, యలమంచిలి, దొడ్డిపట్ల గ్రామాలలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మేడపాడు పీహెచ్‌సీ 1965 ప్రారంభమవ్వగా మిగిలిన రెండు తరువాత కాలంలో ఏర్పడ్డాయి. జిల్లాలో ఉన్న మదర్ పీహెచ్‌సీలలో మేడపాడు కూడా ఒకటి. అయితే మిగిలిన రెండు పీహెచ్‌సీలు 24 గంటలు సేవలు అందిస్తుండగా మేడపాడు పీహెచ్‌సీ మాత్రం ఇంకా 24 గంటల పీహెచ్‌సీ కాలేదు. కొత్త భవనం పూర్తి చేసి, ఈ పీహెచ్‌సీని కూడా 24 గంటలు పీహెచ్‌సీ చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆసుపత్రి నిర్మాణంపై దృష్టి సారించాలి



పేద ప్రజలకు ఆరోగ్య అవసరాలను తీర్చే ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. 1965లో నిర్మించిన భవనమే నేటికీ సేవలు అందిస్తుంది. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే గత ప్రభుత్వం కొత్త భవన నిర్మాణం ప్రారంభించింది. ఈ భవన నిర్మాణం పూర్తి చేసి పేద ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలి.

– అడబాల రామ్మోహనరావు, మేడపాడు